క్లుప్తంగా

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

కనిగిరి రూరల్: వాహనదారులు ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించి ప్రాణ రక్షణ పొందాలని ఎస్సై టి.త్యాగరాజు సూచించారు. స్థానిక పామూరు బస్టాండ్‌లో మంగళవారం హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్మెట్ ధరించడం వల్ల వాహనదారులకు రక్షణ కవచంలా ఉపయోగ పడుతుందన్నారు. హెల్మెట్ ప్రాధాన్యత, ఉపయోగాలపై వాహనదారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు.

ప్రతి పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలి



సభ్యత్వ నమోదులో బీటీఏ ఉపాధ్యాయులు

వలేటివారిపాలెం: రోల్‌తో సంబంధం లేకుండా ప్రతి పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కల్లగుంట మోహన్‌రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మండలంలోని అయ్యవారిపల్లి కాంప్లెక్స్ వద్ద ఉన్న ప్రభుత్వ పాఠశాలలో సభ్యత్వ నమోదు చేపట్టారు. కందుకూరు డివిజన్ కన్వీనర్ అబ్దుల్లా, రాష్ట్ర కార్యదర్శి సంఘ మహేందర్, జిల్లా నాయకులు వెంకట్రావు, వెంకటేశ్వర్లు, మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

డయేరియా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు



టంగుటూరు సమావేశంలో మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి నర్రా జగదీష్

టంగుటూరు: డయేరియా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని స్థానిక పీహెచ్‌సీ సీహెచ్‌వో మాతయ్య పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఆశా వర్కర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు పంచాయతీ కార్యదర్శి నర్రా జగదీష్ అధ్యక్షతన డయేరియాపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓవర్ హెడ్ ట్యాంకులు ప్రతి 15 రోజులకు ఒకసారి క్లోరినేషన్ చేయాలని చెప్పారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగేలా, పరిసరాలు శుభ్రంగా ఉంచుకునేలా ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో సర్పంచి మద్దిరాల మమత, కామని వెంకట్రావు, మక్కెన కోటేశ్వరరావు, బి.వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా ప్రవేశం కార్యక్రమం నిర్వహించాలి

మద్దిపాడు: మండలంలోని అన్ని పాఠశాలల్లో 1 నుంచి 8వ తరగతి వరకూ అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తప్పని సరిగా విద్యాప్రవేశం కార్యక్రమంలో పాల్గొనాలని జిల్లా సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి యం రమేష్ అన్నారు. మంగళవారం మండల రిసోర్స్ కార్యాలయంలో సీఆర్‌పీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల పని తీరును సమీక్షించారు. విద్యాప్రవేశ్, నేను బడికి పోతా, నిష్ఠ, పొగాకు రహిత పాఠశాలలు, ఏక్‌పేడ్‌మాకే నామ్ వంటి కార్యక్రమాల అమలు తీరుపై సమీక్షించారు. ఈ కార్యక్రమాలు తప్పని సరిగా అమలు చేయాలని ఆయన సీఆర్‌పీలను ఆదేశించారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎంఈఓ ఎంవీఆర్ ఆంజనేయులు, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

ఒంగోలు మెట్రో: ప్రతి ఒక్కరి జీవితంలో విద్య ఉన్నత స్థానంలో నిలుపుతుందని, ఆర్థిక సమస్యలతో ప్రతి కుటుంబంలో చిన్నారులు విద్యకు దూరం కాకూడదనే భావనతో కాళిదాసు సేవా సమితి పని చేస్తోందని సమితి వ్యవస్థాపక అధ్యక్షురాలు తీగల సత్యవతి పేర్కొన్నారు. నగరంలోని ఎన్టీఆర్ కాలనీలోని అనాథ బాలల వసతి గృహ నిర్వాసిత పిల్లలు స్థానికంగా ప్రభుత్వ పాఠశాలలో విద్య అభ్యసిస్తున్నారు. నిర్వాహకుల కోరిక మీదట విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులను ప్రవాస భారతీయులు అప్పన్న శ్రీనివాస్, నళిని దంపతుల సహకారంతో మంగళవారం స్ట్రీట్ చిల్డ్రన్ హోంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో అందించారు. కార్యక్రమంలో గుర్రం సత్యనారాయణ, చీమకుర్తి శివప్రసాద్, సుభాదేవి, శ్రీనివాసరెడ్డి, ధనిశెట్టి రామునాయుడు, హోం నిర్వాహకులు బిందు తదితరులు పాల్గొన్నారు.

మేలైన పశుగ్రాసాలతో అధిక పాల ఉత్పత్తి



కొండి కందుకూరు పశుగ్రాస వారోత్సవాల్లో పాల్గొన్న అధికారులు



పశుగ్రాసంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉపసంచాలకులు

కందుకూరు: పశుపోషకులు మేలు రకం పశుగ్రాసాలను సాగు చేయడం వల్ల పశువులకు పాల దిగుబడి పెరుగుతుందని పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ జె.చంద్రమోహన్ అన్నారు. మండలంలోని కొండి కందుకూరు రైతు సేవా కేంద్రంలో మంగళవారం పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ నేపియర్ బహు వార్షిక పశుగ్రాసం రకాన్ని నీటి వసతి ఉన్న రైతులు నాటుకోవచ్చునని చెప్పారు. దీని వల్ల హెక్టార్‌కు 80 నుంచి 100 టన్నుల పశుగ్రాసం లభిస్తుందని చెప్పారు. అలాగే గడ్డి కత్తిరించే మిషన్ వాడడం వల్ల 10 నుంచి 20 శాతం గడ్డి వృథా కాకుండా ఉంటుందని చెప్పారు. కనుపుల గడ్డిని 3 నుంచి 4 అంగుళాల సైజులో కత్తిరించడం వల్ల రుచిగా ఉండి ఆహారాన్ని పశువులు బాగా తీసుకుంటాయని వివరించారు. దీని వల్ల 5 నుంచి 10శాత పాల దిగుబడి పెరుగుతుందని, రైతులు కచ్చితంగా ఇటువంటి సూచనలు పాటించాలన్నారు. కోవూరు పశువైద్యాధికారి డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు పడడం వల్ల పశువుల్లో సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ప్రధానంగా పశువుల్లో గొంతువాపు వ్యాధి, గొర్రెల్లో నీలి నాలుక వ్యాధి రాకుండా ముందస్తుగా టీకాలు వేయించుకోవాలని సూచించారు. అనంతరం జిల్లెలమూడిలో నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ స్కీం కింద బెజవాడ శ్రీను అనే రైతు నిర్మిస్తున్న గొర్రెల షెడ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకులు విజయసాగర్, జయసుహాస్, లోకేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉలవపాడు: పశుగ్రాసంతో అధిక పాల దిగుబడి వస్తుందని పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకుడు చంద్రశేఖర్ అన్నారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రాంతీయ పశువైద్యశాల, పశుగ్రాస యూనిట్‌లలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రత పాడిరైతు కనీసం 5 నుంచి 10 సెంట్లలో పశుగ్రాసం తప్పకుండా వినియోగించుకోవాలని తెలిపారు. అధిక పాల ఉత్పత్తికి ప్రత్యేకమైన దాణా అవసరమన్నారు. రైతులు ప్రభుత్వం అందించే దాణాను ఉపయోగించుకోవాలని తెలిపారు. పశువైద్యాధికారి నజ్మా, పశు సంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పీర్ల పండుగ ప్రారంభం



శంఖవరం చావిడిలో కొలువు తీరిన పీర్లు

● కొలువు తీరిన పీర్లు

కనిగిరి రూరల్: ఇమామే హసన్, ఇమామే హుస్సేన్, ఇమామే ఖాశిం వంశీకుల త్యాగ నిరతికి ప్రతీకగా నిర్వహించుకునే మొహర్రం(పీర్ల పండుగ) వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆదివారం చాంద్‌రాత్ (మొదటి రోజు) నుంచి నియోజకవర్గంలోని పలు పీర్ల చావిడ్లలో (అషూరా ఖానాల్లో) వివిధ నామకరణాలు కల్గిన (హజరత్) పీర్లను కొలువుతీర్చారు. పట్టణంలోని మయాన మకాన్(ఒంగోలు బస్టాండ్, పాతూరు) వద్ద ఉన్న పీర్ల చావిడిలో ఆదివారం రాత్రి చాంద్ రాత్ సవారి అత్యంత వైభవంగా నిర్వహించారు. బారాయిమామ్ పీరును అత్యంత నియమనిష్ఠలతో, తప్పెట్ల తాళాలతో, పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. కుల, మత, వర్గాలకతీతంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. మొహర్రం సందర్భంగా పట్టణంలోని ఐదు పీర్ల చావిడ్లతో పాటు, మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న పీర్ల చావిడ్లను (అషూరా ఖానా)లను ముస్తాబు చేశారు. ఇప్పటికే మయాన మకాన్, శంఖవరం తదితర గ్రామాల్లోని చావిడ్లలో పీర్లు కొలువుతీరి పూజలు అందుకుంటున్నాయి. ఈనెల 14న (ఆదివారం) చిన శరిగత్తు, 16న(మంగళవారం) పెద శరిగత్తు, 17న బుధవారం షహదత్(పీర్లు బావికి వెళ్లేరోజు), 19న పీర్ల జియారత్ కార్యక్రమం జరుగుతాయని ముజావర్లు వెల్లడించారు.

మొహర్రం పండుగకు ముస్తాబైన పీర్లు



చావిడిలో ముస్తాబైన పీర్లు



చావిడిలో గ్రామోత్సవానికి సిద్ధమవుతున్న పీర్ల గుమ్మటం

పామూరు: హిందూ, ముస్లింలు ప్రతిష్టాత్మకంగా మతసామరస్యంగా నిర్వహించుకునే పీర్ల పండుగ మొహర్రం వేడుకలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వారం రోజుల పాటు జరిగే ఈ వేడుకలు ఈనెల 18వ తేదీ గురువారం వరకు నిర్వహించనున్నట్లు ముజావర్‌లు తెలిపారు. ఈ సందర్భంగా ముజావర్‌లు పట్టణంలోని పూలమార్కెట్ సెంటర్, సీఎస్‌పురం రోడ్డు, కనిగిరి రోడ్డులోని పీర్లచావిడి, దర్గాలను, మండలంలోని గోపాలపురంలో ఉన్న దర్గాలను ప్రత్యేక విద్యుద్దీపాలతో సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు పీర్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మార్కెట్ సెంటర్‌లోని పీర్ల గుమ్మటంను గ్రామోత్సవం చేసేందుకు విశిష్ఠ అలంకరణతో సిద్ధం చేస్తున్నారు. మొహర్రం పండుగా వేడుకల్లో భాగంగా 15వ తేదీన చినసరిగత్తు, గ్రామోత్సవం, 16న సందు, 17న పెద సరిగత్తు, 18న పీర్లు గుండప్రవేశం అనంతరం మధ్యాహ్నం పీర్ల జలప్రవేశంతో మొహర్రం వేడుకలు ముగుస్తాయని ముజావర్ ఖాజామొహిద్దీన్ తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

లింగసముద్రం: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు సూచించారు. మండలంలోని వీఆర్‌కోటలో సీజనల్ వ్యాధులపై మంగళవారం ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు సంక్రమించకుండా కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. చేతులు శుభ్రం చేసిన తరువాతే భోజనం చేయాలన్నారు. డయేరియా, డెంగీ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జింక్ మాత్రలను తీసుకోవడం మంచిదన్నారు. జ్వరం, తలనొప్పి, కీళ్ల నొప్పులు, శరీరరంపై దద్దుర్లు వస్తే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఏఎన్‌ఎంలు ఇందిర, రత్నకుమారి, ఎంఎల్‌హెచ్‌పీ షామిలి, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

లింగసముద్రం: విద్యార్థులు బాగా చదువుకోవాలని, అప్పుడే వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంఈఓ-2 శివకుమార్ పేర్కొన్నారు. లింగసముద్రంలోని మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నేను బడికి పోతా, విద్యాప్రవేశం కార్యక్రమాల్లో భాగంగా ఉపాధ్యాయులు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అక్షరాస్యులైనప్పుడే పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతారని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని సూచించారు. ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు చదువు విశిష్టతను వివరించి వారి పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు విద్యాకిట్లను పంపిణీ చేశారు. హెచ్‌ఎం ఎం.సుధాకరరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యా ప్రవేశం నిర్వహిస్తున్న ఎంఈఓ -2 శివకుమార్

డయేరియా నివారణకు కృషి చేయాలి

కనిగిరి రూరల్: డయేరియా నివారణపై మెప్మా రిసోర్స్‌పర్సన్లు చిత్తశుద్ధితో పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగరావు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మెప్మా సిబ్బందికి, రిసోర్స్ పర్సన్‌కు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 1 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు ప్రభుత్వం చేపట్టిన అతిసార నియంత్రణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులై ప్రజలను చైతన్యవంతులు చేయాలని కోరారు. ప్రతి రోజు వార్డుల్లో తిరిగి ప్రజలకు డయేరియా జాగ్రత్త చర్యలపై వివరించాలన్నారు. మెప్మా టీఎంసీ రఘు, సీఓ సురత్నకుమారి, సీఎల్ ఆర్‌పీ దీప్తి, పట్టణ సమాఖ్య కార్యదర్శి రాధమ్మ, ఆర్పీలు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్లను రెన్యువల్ చేయాలి

కొండపి(సింగరాయకొండ): రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలో లెక్చరర్లుగా విధులు నిర్వహిస్తున్న వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కొండపి ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 3,618 మంది గత 24 ఏళ్లగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో ఏటా మే, జూన్ నెలలోనే రెన్యువల్ చేసేవారని, ఈ సంవత్సరం ఇప్పటి వరకు రెన్యువల్ ఇవ్వలేదని, గత రెండు నెలలుగా వేతనం లేక ఇబ్బంది పడుతున్నామని అన్నారు. విద్యార్థుల భవిష్యత్ కోసం మే, జూన్ నెలలో ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసి కళాశాల ఉత్తీర్ణత శాతం పెరగడానికి కృషి చేశామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి తమను రెన్యువల్‌తోపాటు రెగ్యులర్ చేయాలని కోరారు.

హెల్మెట్ వినియోగం తప్పనిసరి

కొనకనమిట్ల: ప్రతి వాహనదారుడు, టూ వీలర్స్ నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ వాడి తమ జీవితానికి భద్రత కల్పించుకోవాలని ఎస్సై కె.మాధవరావు సూచించారు. మంగళవారం సాయంత్రం కొనకనమిట్ల సమీపంలో పలు వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్ వినియోగం వల్ల ఉపయోగాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కొత్త చట్టాలు, న్యాయపరమైన అంశాలపైనా అవగాహన కల్పించారు.

నేడు డయల్ యువర్ డీఎం

పొదిలి రూరల్: స్థానిక ఆర్టీసీ డిపోలో బుధవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ జె.సుందరరావు తెలిపారు. పొదిలి డిపో పరిధిలో ఉన్న ఆరు మండలాలు(పొదిలి, కొనకనమిట్ల, దర్శి, దొనకొండ, కురిచేడు, మర్రిపూడి) మండలాలకు చెందిన ప్రజలు, ప్రయాణికులు 9959225700కు ఫోన్ చేసి పొదిలి డిపో ఆర్టీసీ సర్వీసుల సమయాలు, ట్రిప్పుల గురించి ఏమైనా ఇబ్బందులు ఉంటే తెలియజేయాలని కోరారు.

స్టూడెంట్ కిట్ పరిశీలన



స్టూడెంట్ కిట్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకురాలు భారతి, ఇద్దరు ఎంఈఓలు

చీమకుర్తి: ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన స్టూడెంట్ కిట్‌ను విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకురాలు భారతి పరిశీలించారు. మంగళవారం చీమకుర్తి ఎంఆర్‌సీ కార్యాలయానికి ఆకస్మికంగా వచ్చారు. స్టూడెంట్ కిట్‌లో విద్యార్థులకు ఇస్తున్న నోట్ బుక్స్, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, షూస్ వంటి పలు వస్తువులు సక్రమంగా విద్యార్థులకు అందుతున్నాయా..? లేదా అని తెలుసుకునేందుకు వచ్చినట్లు తెలిపారు. ఎంఆర్‌సీ కార్యాలయం పక్కనే ఉన్న జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థినులకు ఇచ్చిన స్టూడెంట్ కిట్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈఓ-1, 2 డీవీఎల్ నరశింహారావు, కే.శివాజీతో పాటు హైస్కూలు టీచర్‌లు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.



పరీక్షల్లో ఉత్తీర్ణ సాధించిన ఎన్‌సీసీ విద్యార్థులతో కాలేజీ యాజమాన్యం

ప్రకాశం ఎన్‌సీసీ విద్యార్థుల ప్రతిభ

కందుకూరు: ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీ ఎన్‌సీసీ విద్యార్థులు సర్టిఫికెట్ల సాధనలో మరోసారి సత్తా చాటారని కాలేజీ ఎన్‌సీసీ నిర్వాహకుడు ఎస్‌ఎస్ మీరావళి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 34వ ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో జరిగిన పరీక్షలకు 25 మంది విద్యార్థులు హాజరై 100శాతం ఉత్తీర్ణ సాధించారన్నారు. అకడమిక్ ఫలితాలు, క్రీడలు, సాంస్కృతిక పోటీలు, పీపీట పోస్టర్ ప్రజంటేషన్ వంటి పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపిస్తున్నారని తెలిపారు. ప్లేస్‌మెంట్ విభాగంలోను 90శాతం పైగా విద్యార్థులు ఉద్యోగాలు సాధిస్తున్నారని, మూడో సంవత్సరం నుంచే క్యాంపస్ రిక్రూట్‌మెంట్ శిక్షణ ఇవ్వడం వల్ల ప్లేస్‌మెంట్స్‌లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని కాలేజీ టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ కె.విజయ శ్రీనివాస్ తెలిపారు.

ఉపాధి పనులు వెంటనే ప్రారంభించాలి



ఎంపీడీఓ వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

గుడ్లూరు(కందుకూరు): ఉపాధి హామీ పనులు వెంటనే ప్రారంభించి వ్యవసాయ కూలీలను ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీఓ వెంకటేశ్వరరావుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల అనంతరం మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు నిలిచిపోయాయని, దీని వల్ల కూలీలు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అలాగే గతంలో చేసిన పనులకు మూడు వారాల నుంచి డబ్బులు రాలేదని ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎంపీడీఓ మాట్లాడుతూ బుధవారం నుంచి పనులు ప్రారంభిస్తామని, పెండింగ్ కూలీలు వెంటనే చెల్లిస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నేటటూరి తిరుపాలు, మల్లేశ్వరి, మంగమ్మ, సుబ్బయ్య, సీఐటీయూ మండల కార్యదర్శి కొట్టే వెంకయ్య, దామా క్రిష్ణయ్య, డీఐఎఫ్‌ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు జి.స్టాలిన్, డి.సీతారాంలు పాల్గొన్నారు.

పొగాకు అత్యధిక ధర రూ.365



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న శ్రీనివాసరావు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో సోమవారం అత్యధిక ధర రూ.365 పలికింది. కారుమంచి, చింతలపాలెం, పంగులూరివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 729 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 685 కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 44 బేళ్లు తిరస్కరించారు. కనిష్ఠ ధర రూ.205, సరాసరి ధర రూ.310.12 పలికింది. వేలంలో మొత్తం 42 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

పొగాకు గరిష్ట ధర రూ.152

కొండపి(సింగరాయకొండ): కొండపిలోని పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం నిర్వహించిన చూర, ముక్క వేలంలో గరిష్ట ధర 152 రూపాయలు పలికింది. కామేపల్లి, పచ్చవ, అక్కచెరువుపాలెం, గోగినేనివారిపాలెం, పైడిపాడు గ్రామాలకు చెందిన రైతులు 747 బేళ్లు వేలానికి తీసుకురాగా అందులో 654 కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 93 బేళ్లను తిరస్కరించారు. కనిష్ఠ ధర రూ.59, సరాసరి ధర రూ.91.52 పలికింది. వేలంలో ఏడుగురు వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారని నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు.

శ్మశాన ఆక్రమణను అడ్డుకోండి



శ్మశాన స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ సుబ్బారెడ్డి

ఒంగోలు అర్బన్/కొండపి(సింగరాయకొండ): శ్మశాన స్థలం ఆక్రమణకు గురి కాకుండా కాపాడాలని కొండపి మండలం కోయవారిపాలెం గ్రామ వాసులు సోమవారం కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందజేశారు. గ్రామ సర్వే నంబర్లు 368, 384లో భూమిని కొందరు ఆక్రమించి గ్రామస్తులను ఇబ్బంది పెడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ చేపట్టి ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరగా కలెక్టర్ విచారకు ఆదేశించారు. ఈ మేరకు కోయవారిపాలెంలో వివాదాస్పద స్థలాన్ని ఒంగోలు ఆర్డీఓ సుబ్బారెడ్డి మంగళవారం పరిశీలించారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని ఆర్డీఓ పేర్కొన్నారు. ఆయన వెంట ఆర్‌ఐ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ హనుమంత్‌రావు, వీఆర్‌ఓ కోటేశ్వరరావు ఉన్నారు. అలాగే పెట్లూరు లోని సర్వే నెంబర్ 450లో ఉన్న వివాదాస్పద స్థలాన్ని కూడా ఆర్డీఓ పరిశీలించారు.